క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న సర్పంచ్ అలమేలు

ఎటపాక: మండలంలోని రాయనపేట పంచాయతీ ఎర్రబోరు గ్రామంలోని కుర్సం వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. దీంతో ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10వేలను సర్పంచ్ బొర్రా అలవేలు,ఎంపీటీసీ సోయం వెంకటరమణ మంగళవారం అందజేశారు. ఈకార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణ,వార్డు సభ్యుడు బాలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాంబాబు,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఇసాక్‌కు అభినందన



ఇసాక్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొయ్యూరు: డౌనూరు ఆశ్రమ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివిన, విశాఖ ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో జాయిన్ అయిన కొర్రా ఇసాక్ అనే విద్యార్థిని మంగళవారం డౌనూరు హెచ్‌ఎం ప్రభుదాస్, ఉపాధ్యాయులు అభినందించారు. తమ పాఠశాల ఉన్నత పాఠశాలగా మారిన తరువాత మొదటి సారిగా ఇసాక్ ఎంబీబీఎస్‌లో సీటు సంపాదించడం ఆనందంగా ఉందని హెచ్‌ఎం తెలిపారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



ఉపాధ్యాయుడు సూర్యనారాయణదొర భౌతికకాయం

మారేడుమిల్లి: మండలంలోని దేవరపల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల సైన్సు ఉపాధ్యాయుడు బి.సూర్యనారాయణదొర అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఉపాధ్యాయుడి మృతిపై హెచ్‌ఎం డి.నాగేశ్వరరావు, ఎంఈవో, మండలంలోని ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. రంపచోడవరం మండలం కుంజంవీధి గ్రామానికి చెందిన సూర్యనారాయణ దొర 35 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలందించారని, పలువురు గిరిజన విద్యార్థులను జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి సైన్సు ఫెయర్‌కు తీసుకువెళ్లారని హెచ్‌ఎం తెలిపారు. 2018 సంవత్సరంలో రాష్ట్ర స్థాయి అవార్డు పొందారని చెప్పారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేరా మట్టి మేరా దేశ్



మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు

రాజవొమ్మంగి : స్థానిక శ్రీ అల్లూరి సీతారామరాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినీవిద్యార్థులు జాతీయ నాయకుల చిత్ర పటాలతో వీధుల్లో ఊరేగింపు జరిపారు. ఆజాదికా అమృత్ మహోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు హెచ్‌ఎం గోపాలకృష్ణ తెలిపారు. ప్రతి విద్యార్థి దేశభక్తిని కలిగి ఉండాలని ఆయన చెప్పారు.

40 లీటర్ల సారాతో ఒకరి అరెస్ట్



సారాతోపాటు స్వాధీనం చేసుకున్న వాహనం

రావికమతం: 40 లీటర్ల సారాతో నిందితుడిని అరెస్ట్ చేశామని, అతడి నుంచి టీవీఎస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని కొత్తకోట ఎస్ఐ విభీషణరావు మంగళవారం తెలిపారు. కుముందానిపేటలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో తమ సిబ్బందితో మంగళవారం దాడి చేశామన్నారు. టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై 40 లీటర్ల సారా తరలిస్తూ నిందితుడు పట్టుబడినట్టు పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



గంగవరంలో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గంగవరం: ప్రజల ఆరోగ్య పరిరక్షణనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను విజయవంతమయ్యేలా ప్రజా ప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గంగవరం, పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గ్రామ సర్పంచ్‌లు, సచివాలయ, వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ముఖ్యఅతిథులుగా ప్రసంగించారు. గ్రామాల్లో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు విజయవంతం చేయడంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సహకారం అందించాలన్నారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గంగవరం,పిడతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు భావన, సాయిరతన్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరించారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 9 వరకు ఈ వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. వైస్ ఎంపీపీ కె.గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు కనకలక్ష్మి, పద్మావతి, వెంకటలక్ష్మి, ఆదినారాయణ, మండల పరిషత్‌పర్యవేక్షకులు సిద్ధేశ్వరరావు , 17 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

3 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

అడ్డతీగల: మండలంలో వచ్చేనెల 3 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.వి.రంగారావు మంగళవారం తెలిపారు. వైద్య శిబిరాల నిర్వహణకు వైద్యులు, వైద్య సిబ్బంది ,గ్రామసచివాలయాల సిబ్బందితో రెండు బృందాలను ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. వైద్య శిబిరాల తేదీలు, నిర్వహించే ప్రాంతాల వివరాలను ఆయన వెల్లడించారు. వచ్చేనెల 3న వీరవరం గ్రామసచివాలయం వద్ద, 4న గొరయ్యపేట, 5న దుశ్శర్తి, 6న కోనలోవ, 7న డి.రామవరం, 9న గొండోలు, 10న రాయపల్లి, 11న అడ్డతీగల-1,.. 13న తిమ్మాపురం, 16న ధాన్యంపాలెం సచివాలయాల వద్ద, 17న గొంటువానిపాలెం ఎంపీపీ పాఠశాల, 18న డి.భీమవరం ఆశ్రమ ఉన్నత పాఠశాల,19న కిమ్మూరు ఎంపీపీ పాఠశాల, 20న వేటమామిడి గ్రామసచివాలయం , 25న అడ్డతీగల గ్రామసచివాలయం-2 వద్ద వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రంగారావు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు కోరారు. ఆయన మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 30 నుంచి జగనన్న సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. వైద్య శిబిరాల నిర్వహణకు ప్రత్యేక వైద్య నిపుణులు వస్తారని తెలిపారు. తహసీల్దారు ప్రసాదరావు, డీటీ కుమారస్వామి, సీడీపీవో లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలో ఈనెల 30నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణకు రెండు టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. 30న పి.యర్రగొండ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



ఎగువపేడాపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



జాముగుడలో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



శరభవరంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

పెదబయలు: మండలంలోని పెదబయలు, గోమంగి, రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా జరుగుతోంది. అరడకోట గ్రామ హెల్త్ క్లినిక్ పరిధిలోని ఎగువపేడాపల్లి కవెలబంద, తోటలగొంది, వనభంగి గ్రామాల్లో మంగళవారం సర్వే జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పుష్ప, హెల్త్ అసిస్టెంట్ వి.నర్సింగ మూర్తి, గ్రామ వలంటీర్ కె.బాలకృష్ణ, కె.కవిత తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుంటగన్నెల పంచాయతీ జాముగుడలో మంగళవారం వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమం వల్ల అందరికీ మేలు జరుగుతుందని వారు చెప్పారు. ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమాచారం ఇస్తే ఇంటివద్దనే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భానుమతి, హెల్త్ అసిస్టెంట్ రవింద్ర, మహిళ పోలీస్ సంధ్య పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా జరుగుతోందని, ఇప్పటి వరకు ఐదు గ్రామాల్లో సుమారు 3,500 గృహాల్లో సర్వేను పూర్తి చేసినట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. శరభవరంలో మంగళవారం జరిగిన జేఏఎస్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ప్రతి వలంటీరు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ నెలాఖరుకల్లా సర్వే పూర్తి చేయాలని సూచించారు. శరభవరం సచివాలయ పరిధిలో 15 మంది వలంటీర్లు, కింద్రలో 25 మంది, అమీనాబాద్‌లో 12 మంది, గడుఓకుర్తిలో 8 మంది, వంచంగి సచివాలయ పరిధిలో 19 మంది వలంటీర్లు ఆరోగ్యకార్యకర్తలతో కలసి సర్వే చేశారని చెప్పారు. మిగతా గ్రామాల్లో కూడా సర్వే ముమ్మరంగా జరుగుతోందన్నారు. వచ్చేనెల 3వ తేదీ నుంచి 16 హెల్త్ క్లినిక్, సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించనున్ననట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. 3న శరభవరం, 4న కింద్ర, 5న అమీనాబాద్, 6న తంటికొండ, 7న గడుఓకుర్తి, 9న వంచంగి, 10న బడదనాంపల్లి , 11న వాతంగి, 12న దూసరపాము, 13న చికిలింత, 16న రాజవొమ్మంగి, 17న చెరకుంపాలెం, 18న లోదొడ్డి పరిధిలో ఈ శిబిరాలు జరుగుతాయన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం



జి.మాడుగులలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



వేలంలో లడ్డూ దక్కించుకున్న భక్తుడు

జి.మాడుగుల: మండలంలో పాత ఎమ్మార్వోఆఫీస్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాన్ని మంగళవారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాల నడుమ ఊరేగింపు సాగింది. స్థానిక మూడు రోడ్ల జంక్షన్ వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. అనంతరం ఈదులబయలు గెడ్డలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, గిరిజన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గణపతి ఆలయంలో లడ్డూల వేలం

రంపచోడవరం: స్థానిక సంత మార్కెట్‌లోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మూడు లడ్డూలను మంగళవారం వేలం వేశారు. రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.4వేల చొప్పున భక్తులు పాడుకున్నారు. ఈ సొమ్మును ఆలయ దూప,దీప నైవేద్యాల నిర్వహణకు ఉపయోగిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎన్.వీరభద్రరావు, ధర్మప్రచార సేవా భక్త బృందం సమన్వయకర్త నల్లమిల్లి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవోఆర్‌డీగా ప్రసాద్

కొయ్యూరు: ఈవోఆర్‌డీగా ఎస్.కె.వి. ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్‌లో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న ఆయనకు ఈవోఆర్‌డీగా పదోన్నతి కల్పించారు. సీనియర్ పంచాయతీ కార్యదర్శి నాయుడు ఇంత వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఈవోఆర్‌డీగా వ్యవహరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రసాద్ ఎంపీడీవో లాలం సీతయ్యను కలిశారు.

2న అల్లూరి యువజన సంఘం సర్వసభ్య సమావేశం

అడ్డతీగల: జాతీయ అల్లూరి యువజన సంఘం సర్వసభ్య సమావేశాన్ని వచ్చేనెల 2న అడ్డతీగలలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు.అల్లూరి దాడి చేసిన నాటి వాస్తవ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి ఆ రోజు ఉదయం పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తామని పేర్కొన్నారు. అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌పై దాడికి అల్లూరి సీతారామరాజు మిగతా విప్లవకారులతో కలసి వ్యూహ రచన చేసిన మల్లవరం మామిళ్ళు వద్ద తీనెలమంగి ప్రాంతంలోని భారీ మద్దిచెట్టు ఉన్న ప్రాంతాన్ని సందర్శిస్తామని, అల్లూరి చరిత్రపై తంతి తపాలా శాఖ రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించనున్నామని తెలిపారు.

నేడు దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరం

మాడుగుల రూరల్: విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు)కు ఉచితంగా ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరాన్ని చోడవరం ప్రభుత్వ హైస్కూలులో బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.ఎస్.ఎల్. మీనాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, రోలేటర్స్, చెవిమిషన్లు, వాకింగ్‌స్టిక్స్, ఎ.డి.ఎల్.కిట్స్, సిపిచైర్స్, బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్ వంటి ఉపకరణా లు అందించడానికి అర్హులైన దివ్యాంగులను ఎంపిక చేస్తారన్నారు. ఆలిమ్‌కో సంస్థ సహకారంతో ఉపకరణాలు అందజేస్తారన్నారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరానికి సదరం సర్టిఫికెట్‌తోపాటు ఆదాయ, ఆధార్, జెరాక్స్ కాపీలు, పాసుసైజు ఫొటోలు తీసుకొని వెళ్లాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వెదురుపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి పద్మప్రియ

నాతవరం: సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మప్రియ తెలిపారు. మంగళ వారం వెదురుపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల వాతావరణంలో మార్పు కారణంగా గ్రామంలో విషజ్వరాలు వస్తున్నాయని స్థానికులు గునుపూడి వైద్యుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వైద్యాధికారి ఇక్కడ వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించి మందు లు పంపిణీ చేశారు. గ్రామంలో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. వాతావర ణం మార్పు కారణంగా ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

అర్జీదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు



సమీక్షలో పాల్గొన్న అధికారులు

రోలుగుంట: స్పందన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి, వాటిని పరిష్కరించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని అమలుపరచాల్సిన బాధ్యత తమపై ఉందని మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు, ఎంపీడీవో ప్రభాకర్రావు ఆయా శాఖల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న స్పందన నిర్వహణపై మంగళవారం మండల స్థాయి అధికారులతో వారు సమీక్షించారు. సంక్షేమ పథకాలతోపాటు మంజూరు చేసిన నిధులతో వాటి నిర్మాణాల పురోగతిపై శాఖల వారీగా చర్చించారు. ప్రధానంగా సంక్షేమ పథకాల మంజూరు, లబ్ధిదారులకు అందజేతపై చర్చించి, ఏ ఒక్కరి పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించొద్దని సూచించారు. తహసీల్దార్ కె.వరహాలు, ఎస్సై బి.నాగకార్తీక్, వెలుగు ఏపీఎం సాధన, ఎన్ఆర్ఈజీఎస్ అధికారి సూర్యామణి, ఏఈలు ఉమామహేశ్వరుడు, ప్రేమానందం, రాజు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

గొలుగొండ: ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని, వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగించుకోవాలని దళిత సేవా పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు యాదిగిరి దాసు తెలిపారు. ఆయన మంగళవారం కమిటీ సభ్యులతో కలిసి స్థానిక గురుకుల కళాశాలను సందర్శించారు. భోజనం పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే ప్రతీ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఆనందరావును సత్కరించారు. మెరుగైన సేవలు అందించడం వల్ల మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. గొలుగొండ, ఏఎల్‌పురం సర్పంచ్‌లు కసిపల్లి బుజ్జి, లోచల సుజాత, కమిటీ సభ్యులు ఎంఏ రాజు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

వరిలో అగ్గి తెగులు



సూకురులో వరి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త చిట్టిబాబు

హుకుంపేట: వరిపంటలో అగ్గి తెగులు రాకుండా రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చిట్టిబాబు తెలిపారు. మండలంలోని సూకురు పంచాయతీ కేంద్రంతో పాటు చట్రాపుట్టు గ్రామంలో వరి పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. వరి చేను ఎండిపోయి, మచ్చలు ఏర్పడడాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల, అడప దడప వర్షాలు కుస్తున్నందున అగ్గితెగులు సోకిందని చెప్పారు. దీని నివారణకు సుడోమోనస్ ఒక కిలోకు 200లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలని, తెగులు ఎక్కువగా ఉంటే ట్రైసైక్లోజోల్ 120 గ్రాముల చొప్పున ఎకరానికి పిచికారీ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయాధికారి లీలావతి విజయలక్ష్మి, సిబ్బంది మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించండి



తహసీల్దార్ అప్పలస్వామికి వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీలు

జి.మాడుగుల: మండల కేంద్రం జి.మాడుగులలో ఎంపీ కోటా నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవనానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మంగళవారం ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర,సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడులు తహసీల్దార్ అప్పలస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిటీహాల్ భవనానికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్.కళ్యాణం, సూర్యప్రకాష్ నాయుడు, చిట్టిబాబు, గంగరాజు, కొండపల్లి మత్స్యరాజు, అంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కుండపోతగా వర్షం



పెదబయలు గ్రంథాలయం వీధిలో నిలిచిపోయిన వర్షం నీరు



డుంబ్రిగుడలో కురుస్తున్న వర్షం

పెదబయలు: మండలంలో కుండపోతగా వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. అనంతరం సమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పలువీధుల్లో వర్షం నీరు నిలిచిపోయి, ఇళ్లలోకి చేరింది.

డుంబ్రిగుడలో భారీ వర్షం

డుంబ్రిగుడ: మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో అరకు-పాడేరు రహదారిలో ద్విచక్ర వాహన దారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మారుమూల ప్రాంతం నుంచి మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు వర్షం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రైతులకు భూహక్కు పట్టాల పంపిణీ



రైతులకు భూహక్కు పట్టాలు అందజేస్తున్న తహసీల్దార్ అన్నాజీరావు

నర్సీపట్నం: గురంధరపాలెంలో మంగళవారం భూహక్కు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ అన్నాజీరావు రైతులకు భూహక్కు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల నాటి భూసమస్యలకు జగనన్న రీసర్వే ద్వారా పరిష్కారం లభించిందన్నారు. చిన్న చిన్న సమస్యలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే వారన్నారు. ఆ పరిస్థితి లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు భూములను సర్వే చేసి హద్దులు నిర్ధారించామన్నారు. దశల వారీగా అన్ని గ్రామాల్లో భూహక్కు పట్టాలను అందజేస్తామన్నారు. సర్పంచ్ శానాపతి వెంకటరత్నం, ఆర్ఐ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా కోలాటం బృందానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఉప సర్పంచ్ కరక అప్పలరాజు

నాతవరం: గ్రామాల్లో ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు మహిళల కోలాటం ఎంతగానో దోహదపడుతుందని వైఎస్సార్‌సీపీ నేత, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు అన్నారు. స్థానిక శ్రీలక్ష్మి నరసింహస్వామి కోలాటం బృందానికి అంకంరెడ్డి నూకరాజునాయుడు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల సమక్షంలో రూ. 10 వేలు మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో వినాయక గుడి, కోటమ్మతల్లి ఆలయాలు సర్వాంగ సుందరంగా నిర్మించామన్నారు. ఆలయాల వద్ద మహిళలు కోలాటం, భజనలు చేయడంతో ప్రజల్లో మరింత భక్తి భావం పెరుగుతుందన్నారు. నూకాలమ్మ తల్లి అలయ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి వెంకటరమణ, విశ్రాంత సూపరింటెండెంట్ ఎ.శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు పాల్గొన్నారు.

పాడిరైతుల చెంతకే పశువైద్య సేవలు

రావికమతం: గడపగడపకు పశువైద్యం అనేలా పాడిరైతుల చెంతకే వైద్య సిబ్బంది వెళ్లి పశువులకు వైద్య సేవలందించాలని పశుసంవర్ధక శాఖ పాడేరు ఉప సంచాలకుడు సీహెచ్ నరసింహులు తెలిపారు. ఎంతో లాభదాయకమైన కోళ్ల, గొర్రెల పెంపకం యూనిట్లు అర్హులకు అందించేందుకు సిబ్బంది మరింతగా కృషి చేయాలన్నారు. రావికమతం సహాయ సంచాలకుడు చిన్నంనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం రావికమతంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు, గోపాల మిత్రలు, సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడేరు ఉప సంచాలకుడు మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులు, ఔత్సాహిక వంతులైన యువతను గుర్తించి వారికి మినీ డెయిరీ, కోళ్లు, గొర్రెల పెంపకం యూనిట్ల స్థాపనకు కృషి చేయాలన్నారు. సంస్థ ద్వారా అందిస్తున్న వివిధ పథకాలు, ఆధునిక పద్ధతులు గురించి రైతులకు వివరించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ ఎలా వెళ్తున్నారో.. మనమూ క్షేత్రస్థాయిలో రైతుల కళ్లాల వద్దకే వెళ్లి పశువులకు సేవలందించడమే కాక పాడిరైతుకు భరోసాగా ఉండాలన్నారు. అనంతరం గొంప, రావికమతం రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. సిబ్బంది ప్రగతి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పలువురు రైతులకు పశు ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. పశువిజ్ఞాన బడి ద్వారా స్థానిక పాడి రైతులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పశుగ్రాస విత్తనాలను, సంపూర్ణ మిశ్రమ దాణా, పశుబీమా, సంచార వైద్య సేవలను సద్వినియోగించుకోవాలని కోరారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు బైక్ యాత్ర

కె.కోటపాడు: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 20 నుంచి 29 వరకు ఉక్కు పరిరక్షణ యాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నిర్వహించనున్న బైక్‌యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆనందపురం, వారాడ గ్రామాల్లో పార్టీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో 16వేల మంది రైతులకు సంబంధించి 22 వేల ఎకరాల భూత్యాగ ఫలితంగా లక్షల మందికి స్టీల్ ప్లాంట్ ఉపాధి కల్పిస్తుందన్నారు. ఇటువంటి స్టీల్ ప్లాంట్‌ను విక్రయించడానికి చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు.